భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు



శాకంబరి అలంకరణలో వాసవీ మాత



రామచంద్రరావుపేటలో వేంకటేశ్వర స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా గురువారం నగరంలోని పలు ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. స్వామి వార్లకు, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పాత బస్టాండు వద్ద పాండురంగ స్వామి దేవస్థానంలో ఉదయం సామూహిక రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించారు. తులసి దళాలతో పాండురంగ స్వామి, లక్ష్మీ నారాయణ స్వామి, సీతారామ స్వామి వార్లకు అర్చన చేశారు. పాండురంగ స్వామిని త్రివిక్రమునిగా (వామనావతారంలో) అలంకరించి ప్రజలకు దర్శనం కల్పించారు.



పాండురంగ స్వామిని దర్శించుకుంటున్న ఎస్ఎంఆర్ పెదబాబు

స్వామివారిని ఏలూరు నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు దర్శించుకున్నారు.



విశేష అలంకరణలో అగ్రహారం జనార్దన స్వామి

సాయంత్రం రుక్మాబాయి సమేత పాండురంగ స్వామి శాంతి కల్యాణం నిర్వహించారు. దొండపాడు శ్రీ నం దత్తనాథ క్షేత్రంలో రమా సహిత శ్రీ సత్యనారాయణ స్వామి పూజలను భక్తులు సామూహికంగా ఆచరించుకున్నారు. రామచంద్రరావుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి విశేష అలంకరణ చేశారు. విష్ణు సహస్రనామ పారాయణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. అగ్రహారం జనార్ధన స్వామి దేవస్థానంలో స్వామి వారికి విశేష అభిషేకాలు చేశారు. పెరుగుచెట్టు వద్ద వాసవి కన్యకాపరమేశ్వరి సత్రంలో వాసవి మాతకు శాకంబరి అలంకరణ చేశారు.

క్లుప్తంగా

పోరుకేకకు మద్దతుగా ప్రచారం



పోరుకేకకు మద్దతుగా ప్రచారం చేస్తున్న వృత్తి సంఘాల నాయకులు

ఏలూరు (టూటౌన్): పోలవరం నిర్వాసితులందరికీ పూర్తిస్థాయిలో పునరావాసం కల్పించాలని కోరుతూ నిర్వహిస్తోన్న పోరుకేక పాదయాత్ర ఏలూరు జిల్లా కరుటూరు చేరుకుంది. ఈ యాత్రకు మద్దతుగా ఏపీ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ ఏలూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక పత్తేబాద ప్రాంతంలో ప్రచారం, విరాళాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా వృత్తి సంఘాల రాష్ట్ర కన్వీనర్ ఎం.భాస్కరయ్య మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని ఆరోపించారు. పోలవరం నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం, పునరావాసం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మత్స్యకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లాటి శ్రీనివాస్, ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మడక రాజు, సీఐటీయూ నాయకులు బి.సోమయ్య, చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, నాయకులు వి.కిషోర్, వేణు, శివ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌కు అభినందనలు



జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ దెందులూరు నాయకులు

పెదపాడు: ఉమ్మడి జిల్లాపరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్‌లను దెందులూరు మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. చైర్‌పర్సన్‌ను పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. మండలంలోని పలు విషయాలను చర్చించారు. దెందులూరులో వెలమల ఆశాజ్యోతి తాంద్రపాపారాయుడు విగ్రహావిష్కరణ వంటి విషయాలపై చర్చించారు. తమ వంతు సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో నాయకులు సంబంగి వేణుగోపాల తిలక్, రాజేష్, వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

కష్టజీవులకు అండగా నిలుద్దాం



జనకవనం కార్యక్రమంలో పాల్గొన్న కవులు, కళాకారులు

ఏలూరు (టూటౌన్): కష్ట జీవులకు అండగా నిలవాలని సాహితీ స్రవంతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్య రంజాన్ కవులు, కళాకారులను కోరారు. సీఐటీయూ జిల్లా స్థానిక కార్యాలయంలో గురువారం సాహితీ వేత్త లంకా వెంకటేశ్వర్లు అధ్యక్షతన సాహితీ స్రవంతి, జిల్లా రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో పోలవరం నిర్వాసితులకు సంఘీభావంగా జనకవనం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సత్యరంజాన్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు మద్దతుగా కవులు, కళాకారులు కవితలు, పాటలు వినిపించడం అభినందనీయమన్నారు. జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి నాగాస్త్ర మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు వల్ల అభివృద్ధి అనేది ఎంత నిజమో.. గిరిజనుల సంస్కృతి నాగరికత, అస్తిత్వం నాశనం అవుతున్నాయన్నదీ అంతే నిజమని అన్నారు. పోలవరంలో లక్షలాది గిరిజనుల త్యాగాలు ఉన్నాయని గుర్తు చేశారు. సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ కె.రామాంజనేయులు, ఏపీ గ్రంథాలయ సంఘం రాష్ట్ర కార్యదర్శి లేళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు న్యాయం జరిగే వరకూ తమ గళాన్ని, కలాన్ని ఉపయోగిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో రామ్మోహన్‌రావు, ఆనంద నాయుడు, ముస్తాఫా ఆలీ, జీవీఎల్ నరసింహారావు, నారాయణ, శ్రీహరికోటి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షలో అర్హులందరికీ లబ్ధి

ఏలూరు టౌన్: జగనన్న సురక్ష కార్యక్రమంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు, 11 రకాల సర్టిఫికెట్లను మంజూరుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మూడు రోజులుగా 50వ డివిజన్‌లో ఏలూరు నగర పాలక సంస్థ కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు ఆధ్వర్యంలో నోడల్ ఆఫీసర్, నగర డిప్యూటీ కమిషనర్ ఎన్.రాధా సచివాలయ సెక్రటరీలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, పార్టీ నాయకులు ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలపై ఆరా తీస్తున్నారు. ఏలూరు నగరంలో 8 టీమ్‌లుగా 22 క్లస్టర్లలో సుమారుగా 1300 ఇళ్లను సందర్శించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మూడు రోజుల్లో 900 ఇళ్లకు వెళ్లి సర్వే చేశారు. 446 మంది వివిధ సేవలు తమకు కావాలని కోరారు. సర్టిఫికెట్లు కోరిన వారికి 316 టోకెన్లను అధికారులు అందజేశారు. ఇప్పటికే 76 మందికి సంబంధించి దరఖాస్తులు ఆన్‌లైన్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎంఆర్ పెదబాబు మాట్లాడుతూ జగనన్న సురక్షలో ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకుంటున్నామని, ఆయా కుటుంబాల అవసరాలను ఆన్‌లైన్ చేయిస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆదేశాలతో జగనన్న సురక్ష సర్వే శ్రద్ధతో చేపడుతూ కబాడీగూడెం సచివాలయంలో దరఖాస్తులు ఆన్‌లైన్ చేయిస్తున్నామన్నారు. జూలై 4న చేపట్టే జగనన్న సురక్ష క్యాంపులో అర్హులందరికీ సర్టిఫికెట్లు మేయర్ నూర్జహాన్ చేతులమీదుగా అందజేసేందుకు చర్యలు చేపట్టామన్నారు.



సచివాలయంలో దరఖాస్తుల ఆన్‌లైన్‌ను పరిశీలిస్తున్న కోఆప్షన్ సభ్యుడు పెదబాబు

జూట్ మిల్లు మూసివేత బాధాకరం

ఏలూరు (టూటౌన్): 118 ఏళ్ల పాటు కొనసాగిన ఏలూరు శ్రీకృష్ణా జూట్ మిల్లు శాశ్వతంగా మూతపడటం బాధాకరమని ఇఫ్టూ జిల్లా కమిటీ గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ నెల 22న జేసీఎల్ సమక్షంలో జరిగిన అగ్రిమెంట్‌పై యాజమాన్యం, ఆరు కార్మిక సంఘాలు సంతకాలు చేసే పరిస్థితి రావటం విచారకరమని తెలిపింది. ఐదు తరాలుగా కార్మికుల శ్రమశక్తి మీద ఆధారపడి కలకత్తాకు చెందిన భర్తీయా, లునాని కుటుంబాలు లాభాలు ఆర్జించాయని పేర్కొంది. దీనికి అనుబంధంగా కొత్తూరు జూట్ మిల్లు స్థాపించడంతో పాటు గుంటూరు, రాయపూర్ మిల్లులను కొనుగోలు చేశారని వివరించింది. రాజీనామా చేయకుండా మిగిలిన 600 మంది కార్మికులకు తమకు రావాల్సిన రాయితీలు, ఇతర అంశాలపై జేసీఎల్ సమక్షంలో అంగీకారం కుదిరిందని, దీన్ని కొన్ని కార్మిక సంఘాలు విమర్శించడం తగదని పేర్కొంది. ప్రకటన విడుదల చేసిన వారిలో ఇఫ్టూ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి బద్దా వెంకట్రావు ఉన్నారు.

నేడు సబ్‌స్టేషన్ పనులకు శంకుస్థాపన

ఏలూరు రూరల్: ఏలూరు మండలం గుడివాక లంకలో విద్యుత్ సబ్‌స్టేషన్ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ముఖ్య అతిథిగా హాజరవుతారు. సుమారు రూ.4 కోట్లతో చేపట్టే ఈ సబ్‌స్టేషన్ పూర్తయితే కొల్లేరు గ్రామాల విద్యుత్ సమస్యలకు చెక్ పడుతుంది. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి చొరవతో ప్రభుత్వం సబ్‌స్టేషన్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే.

విద్యుత్ వినియోగాన్ని 500 యూనిట్లకు పెంచాలి

ఏలూరు (టూటౌన్): పెన్షన్‌దారులకు 300 యూనిట్ల విద్యుత్ వినియోగం నిబంధనను సడలించాలని కేంద్ర ప్రభుత్వ పారిశ్రామిక మండలి మాజీ సభ్యుడు పులి శ్రీరాములు ఒక ప్రకటనలో కోరారు. వేసవి దృష్ట్యా ఎండలకు తట్టుకోలేక వృద్ధులు ఎక్కువగా ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు వాడిన కారణంగా గత మూడు నెలలుగా విద్యుత్ వాడకం 300 యూనిట్లకు పైగా పెరిగి బిల్లులు వచ్చాయని తెలిపారు. ఈ నేపథ్యంలో తమకు నెలనెలా వచ్చే పింఛన్ పోతుందేమోనని భయాందోళనలు వృద్ధుల్లో నెలకొందని పేర్కొన్నారు. విద్యుత్ వాడకాన్ని 500 యూనిట్లకు పెంచి, యథావిధిగా నెలవారీ పింఛన్‌ను అందించాలని విజ్ఞప్తి చేశారు.

జన జాగృతి సభను విజయవంతం చేయండి

పెదవేగి: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ నాయకత్వంలో జూలై 7న విజయవాడ జింఖానా గ్రౌండ్‌లో తలపెట్టిన జనజాగృతి సభను విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు యర్రా నాగమల్లేశ్వరరావు మాదిగ పిలుపునిచ్చారు. గురువారం పెదవేగి మండలం రాయన్నపాలెంలో ఎంఆర్‌పీఎస్ సీనియర్ నేత అబ్బుదాసరి శౌరి మాదిగ అధ్యక్షతన జన జాగృతి సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. నాగమల్లేశ్వరరావు మాదిగ మాట్లాడుతూ మాదిగల జన జాగృతి సభను విజయవంతం చేయడానికి మాదిగ, మాదిగ ఉపకులాలు అందరూ తరలివచ్చి విజయకేతనం ఎగరవేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. రాబోయో రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేయకపోతే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

మహిళా రక్షణ చట్టాలను కఠినంగా అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

ఏలూరు (టూటౌన్): మహిళలు, చిన్నారులకు రక్షణ కల్పించే చట్టాలను కఠినంగా అమలు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి కోరారు. మహిళలపై జరుగుతోన్న హింసపై యాత్ర సదస్సు స్థానిక పవరుపేటలోని ఐద్వా కార్యాలయంలో పి.హైమావతి, జి.శారద అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రమాదేవి మాట్లాడుతూ నిందితులకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులో త్వరితగతిన విచారణ చేసి కఠినమైన శిక్షలు విధించాలన్నారు. ప్రభుత్వం, మీడియా మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని, హింస, అశ్లీల అసమానతలను ప్రేరేపించే చిత్రాలను, టీవీ సీరియల్స్, ఇంటర్నెట్ కార్యక్రమాలను నిషేధించాలని కోరారు. కాలేజీల్లో, పని ప్రదేశాల్లో వేధింపులు నిరోధక చట్టాలను అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. మద్యం, మత్తుమందు పదార్థాలను నియంత్రించే చర్యలు చేపట్టాలని కోరారు. మండలానికి ఒక్క మద్యం షాపు మాత్రమే అనుమతించాలని, మహిళలకు విద్యా, ఉపాధి హక్కుగా గుర్తించి అమలు చేయాలని అన్నారు. నిజాన్ని నిర్భయంగా చెప్పే తులసి చందు లాంటి జర్నలిస్టులపై బెదిరింపు చర్యలు అరికట్టాలని, తులసీ చందుకు మహిళా సంఘం అండగా నిలబడుతుందని తెలిపారు. ఈ యాత్రలో మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. సదస్సులో మహిళా సంఘంనాయకులు వి.వెంకటరమణ, ఉషారాణి, సీహెచ్ అందోళనమ్మ, వరలక్ష్మి, గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

'సంక్షేమంలో చరిత్ర సృష్టించాం'



నడిపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి

పెదవేగి : ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో చరిత్ర సృష్టించామని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. పెదవేగి మండలం నడిపల్లి గ్రామంలో ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం గురువారం కోలాహలంగా నిర్వహించారు. అడుగడుగునా ప్రజలు పూలహారతులు పట్టి ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అభివృద్ధి గురించి వివరించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అంటూ ప్రతి ఒక్కరిని అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి పథకాలు అందని వారు ఉంటే, వారి వివరాలు సేకరించి పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు, వలంటీర్లకు సచివాలయ సిబ్బందికి సూచించారు. ప్రజలనుంచి వచ్చిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందించడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారని చెప్పారు. ఈ మేరకు ఇచ్చిన ప్రతీ మాట నిలబెట్టుకుని అమలు చేశామని, ప్రజలు కూడా ఓటు వేసి గెలిపించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకున్నామని, ఈ ప్రభుత్వంలో మీకు లబ్ధి చేకూరిందని బావిస్తేనే ఓటు వేయాలని బహిరంగంగా అబ్బయ్యచౌదరి ప్రజలను కోరారు. గ్రామంలో వలంటీర్ వ్యవస్థ పనితీరు బాగుందని ప్రజల నుంచి గడపగడపకు మన ప్రభుత్వం పై సానుకూల స్పందన ఉందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, ఎంపీపీ తాతా రమ్య, బీసీ నాయకులు ఘంటా ప్రసాదరావు, విజయరాయి సొసైటీ అధ్యక్షుడు పాలడుగు పెదబాబు, ముండూరు సొసైటీ అధ్యక్షుడు చెరుకూరి ప్రసాద్, గ్రామ నాయకులు ఉక్కుర్తి నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ మద్దాల మోహనరావు, మేక రమేష్, గొట్టేటి స్టాలిన్, మట్టా రాంపండు, మద్దాల వాసుదేవరావు, మద్దాల గోపాలరావు, చల్లారి నాగు, గుంటూరి జార్జ్, మేక నారాయణరావు, నక్కా బాబు, గొడ్డాటి విజయరాజు, గొడ్డాటి తాతారావు, వెంట్రపాటి విలియం, వెంట్రపాటి మహేష్, ఇతర గ్రామాల సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు ఆషాడం సారె



ఉండ్రాజవరం గ్రామంలోని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ఆషాడం సారె అందజేస్తున్న గ్రామ మహిళలు

దెందులూరు: అమ్మలగన్న అమ్మ ముగ్గురమ్మల మూలపుటమ్మలుగా విరాజిల్లుతూ ఉండ్రాజవరం గ్రామాన్ని కంటికి రెప్పవలే కాపాడుతున్న తల్లులు కనకదుర్గమ్మ తల్లి, సోమాలమ్మ తల్లి, పుంతల ముసలమ్మ తల్లి అమ్మవార్లకు ఉండ్రాజవరం గ్రామ మహిళలు గురువారం ఆషాఢం సారెను అందజేశారు. గ్రామంలోని మహిళలందరూ ఊరేగింపుగా మేళతాళాలతో, మంగళవాయిద్యాలతో కోలాటాల నృత్యాల నడుమ గ్రామంలోని పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఉండ్రాజవరం గ్రామ ఆడపడుచులుగా పూజలందుకుంటున్న ముగ్గురు అమ్మవార్లకు ఆషాఢం కానుకగా పుట్టింటి సారెను గ్రామ మహిళలు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని చూడటానికి ఉండ్రాజవరంతో పాటు సమీప గ్రామాల్లోని మహిళా భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	68	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	38	చిక్కుడు కాయలు	--
వంకాయలు (కాంతులు)	34	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	40	ములక్కాడలు	07-10
బెండకాయలు	42	కంద	48
పచ్చిమిర్చి	74-82	బీట్‌రూట్	38
కాకర కాయలు	54	కీరా దోస	54
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	54	అల్లం	130-220
క్యాబేజీ	24	కొత్తిమీర (కట్ట)	20-35
క్యారెట్	36	పాలకూర	12
దొండకాయలు	34	చుక్కకూర	12
బంగాళదుంపలు	24	తోటకూర	10
ఉల్లిపాయలు	20	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	24	బఠాణీ	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	15	చిలకదదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	35
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	31

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	23
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	27
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	27
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	34
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు -తిరుపతి	16.00	4830	26